## ఎంవీఐ కిశోర్‌కుమార్ బదిలీ



సిరిసిల్ల: జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ మంచిర్యాల జిల్లా ఎంవీఐగా బదిలీ అయ్యారు. సిరిసిల్ల ఎంవీఐగా ఆసిఫాబాద్ జిల్లా నుంచి రంగన్నగారి శోభన్‌బాబు నియమితులయ్యారు.



## పాదయాత్రగా రాజన్న వద్దకు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లికి చెందిన శ్రీగీతామందిరం భక్తులు రఘు రామశర్మ ఆధ్వర్యంలో వేములవాడ రాజన్న దర్శనానికి పాదయాత్రగా బయలుదేరారు.

గరిష్టం/కనిష్టం

34.0/21.0

## వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. గాలిలో తేమ ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.



# పోదాం పద.. సమ్మక్క జాతర

వనదేవతల జాతరకు అంతా సిద్ధమైంది. రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క– సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈనెల 21న సారలమ్మ ఆగమనంతో ప్రారంభమయ్యే జాతర 24న తల్లుల వన ప్రవేశంతో ముగుస్తుంది. జాతరకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న సమ్మక్క గద్దెలను సిద్ధం చేస్తున్నారు. గద్దెలకు రంగులు, చలువ పందిళ్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, నీరుకుల్ల, రేకుర్తి, శంకరపట్నం తదితర ప్రాంతాలు మినీ మేడారాన్ని తలపించగా... మరో 100కు పైగా ప్రాంతాల్లో సమ్మక్క– సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. దూరప్రాంతంలో ఉన్న మేడారాన్ని వెళ్లేందుకు వీలుకాని భక్తులు సమీప గద్దెల వద్ద తల్లులకుమొక్కులు చెల్లించుకుంటారు. జాతర సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని సమ్మక్క జాతర ప్రాంతాలు.. జరుగుతున్న ఏర్పాట్లు.. ఆయా ప్రాంతాల ప్రత్యేకతపై సండే స్పెషల్..!! - 8లో



## న్యూస్‌రీల్

### బీసీ కులగణనతో సామాజిక న్యాయం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల: వెనకబడిన కులాల(బీసీ)ను లెక్కించాలని రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీసీ భవన్‌లో శనివారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించడం హర్షణీయమన్నారు. బీసీ కులగణనతో సామాజిక న్యాయంతోపాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయరంగాలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కుతుందన్నారు. బీసీ కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తడక కమలాకర్, కందుకూరి రామాగౌడ్, దేశపాండే ఆంజనేయులు, కంచర్ల రవిగౌడ్, బట్టు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీగాథ గణేశ్, ఎలుక రాజు, మామిండ్ల భూపతి, గజ్జెల రాజు, ఇల్లంతకుంట తిరుపతి, చొక్కి కైలాశ్, పెరక గంగరాజు, నంద్యాడపు శ్రీనివాస్, శ్యామ్, శ్రీధర్ పాల్గొన్నారు.

### మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న డీపీఎం సుధారాణి

గంభీరావుపేట(సిరిసిల్ల): మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'లఖ్‌పతి దీదీ' పథకం అమలు చేస్తోందని ఐకేపీ డీపీఎం సుధారాణి పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈ పథకంపై వీవోఏలకు రెండు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నారు. పథకం ముఖ్యాంశాలు, ప్రధాన ఉద్దేశ్యాలను డీపీఎం వివరించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రోత్సహించాలన్నారు. ఐకేపీ ఏపీఎం సుదర్శన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, సీసీలు సురేందర్, పర్శరాములు, వనిత, లావణ్య, పద్మ, వీవోఏలు పాల్గొన్నారు.

### నర్సింగపూర్‌కు గోదావరి జలాలు



పూజలు చేస్తున్న నర్సింగపూర్ గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): నర్సింగపూర్ గ్రామానికి గోదావరి జలాలు శనివారం చేరాయి. మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు గోదావరి జలాలకు పూజలు చేశారు. నాయకులు పూదూరి జీవన్‌రెడ్డి, ఇల్లంతకుంట గణేష్, ఇల్లంతకుంట శ్రీనివాస్, దొబ్బల శంకర్, మల్యాల శ్రీనివాస్, శీలం గణేష్, పెరుక రాజు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయికి ఎంపిక



బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గంభీరావుపేట మండలస్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన లింగన్నపేట హైస్కూల్ విద్యార్థులు ప్రణవి, అభిజ్ఞ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో శనివారం మండలస్థాయి పరీక్షలో 11 పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎంలు పద్మాదేవి, రామారావు, సైన్స్ ఉపాధ్యాయులు లక్ష్మణ్, రమ, శంకర్, నరసింహారాజు, రాజేశ్, సదయ్య, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

## కంటికి రెప్పలా.. పంటకు కాపలా !

- రైతులను వణికిస్తున్న వన్యప్రాణులు
- చేతికొచ్చిన పంట నేలపాలు
- జిల్లాలో అన్నదాతల ఆందోళన



'వరి పొలం చుట్టూరా కర్రలకు వలలు కట్టి, పొలం ఒడ్డుపై కాపలాగా ఉన్న ఇతను నాగాల వెంకటేశ్. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన వెంకటేశ్‌కు 12 ఎకరాల భూమి ఉంది. మొత్తం వరి పంట వేశాడు. గుట్టపైనున్న కోతులు వచ్చి వరి చేనులో పడుతున్నాయి. వరిదుబ్బులను పీకేస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు వెంకటేశ్ నిత్యం ఇలా పొలం వద్ద కాపలా ఉంటూ రక్షించుకుంటున్నాడు. పొలం వద్ద ఎవరూ లేకుంటే.. చేతికి రాకుండా కోతులు గుంపుగా వచ్చి నాశనం చేస్తాయి.' ఇది ఒక్క వెంకటేశ్ పరిస్థితే కాదు. జిల్లావ్యాప్తంగా అటవీ గ్రామాల శివారు పల్లెల్లో అందరు రైతుల పరిస్థితి ఇదే..



'ఇది వీర్నపల్లిలోని గిరిజన రైతుకు చెందిన ఓ మక్కచేను. అడవి పందులు పడి.. చేనునంతా నాశనం చేశాయి. మొక్కజొన్న కంకులను విరిచి తినడమే కాదు.. మొక్కలను విరగ్గొట్టి పోయాయి. పాలు పట్టే దశలో ఉన్న మొక్కజొన్న చేనంతా అడవి పందుల పాలు కావడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటను కాపాడుకునేందుకు నిత్యం రాత్రి వేళల్లో మొక్కజొన్న చేను వద్దనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది..' ఇలా జిల్లాలో వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవడం రైతులకు చాలా కష్టంగా మారింది.

సిరిసిల్ల: అటవీ గ్రామాల్లో పంటలకు వన్యప్రాణుల బెడద ఎక్కువైంది. చేతికొచ్చిన పంటలపై అడవి జంతువులు దాడిచేస్తూ పంటను పాడుచేస్తున్నాయి. అడవిని ఆనుకుని ఉన్న పల్లెల్లో అన్నదాతలకు కునుకు కరువై వణికిపోతున్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, ముస్తాబాద్, కోనరావుపేట, సిరిసిల్ల ఇల్లంతకుంట మండల్లాల్లోని అటవీ సమీప గ్రామాల్లో రైతులు కంటికి రెప్పలా.. పంటకు కాపలా ఉంటూ రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా పంటనష్టం తప్పడం లేదు. అడవి పందులు, నక్కలు, కోతులు దాడిచేస్తూ పంటలను పాడుచేస్తున్నాయి. ప్రధానంగా వరి, మక్క, వేరుశెనగ, పొద్దుతిరుగుడు వంటి పంటలను వన్యప్రాణులు తినేస్తున్నాయి. జిల్లాలో అటవీ శివారు గ్రామాలైన వన్‌పల్లి, శాంతినగర్, రంగంపేట, అడవిపదిర, అక్కపల్లి, గర్జనపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, వెంకటాపూర్, తిమ్మాపూర్, గుండారం, గజసింగవరం, దమ్మన్నపేట, జిల్లెల్ల, లక్ష్మీపూర్, రుద్రంగి, మానాల, మరిమడ్ల, వట్టిమల్ల, వెల్లీపూర్, పెద్దలింగాపూర్, రామాజీపేట, లింగంపేట, సనుగుల, వీర్నపల్లి, రాజన్నపేట గ్రామాల శివారులో అడవి పందులతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో పంటలపై పడి కర్రలు విరుగ్గొడుతూ కంకుల్ని తింటున్నాయి. అడవి పందులను బెదిరించేందుకు రైతులు డప్పులతో చప్పుడు చేస్తూ రాత్రి వేళల్లో అలికిడి చేస్తూ రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ఆరుగాలం శ్రమించిన పంట చేతికందే దశలో అడవి జంతువులు పాడుచేయడం ఆందోళనకు గురిచేస్తోంది. చేను వద్ద ఉన్న మంచెలోనే ఉంటూ రైతులు పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



వరి పొలం చుట్టూరా పెట్టిన వైరు, దారం

### చట్టవిరుద్ధమైనా..

వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు చట్టవిరుద్ధంగా విద్యుత్‌తీగలను పంట చుట్టూరా అమర్చుతున్నారు. ఇలా అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ప్రాణాలు పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. జిల్లాలో పోలీసులు సైతం ఇలా తీగలు పెట్టే వారిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నారు. ఎవరైన విద్యుత్ తీగలను పొలాల వద్ద పెడితే.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చట్టవిరుద్ధమని తెలిసి చాలా మంది రైతులు విద్యుత్ తీగలకు బదులుగా దారం, వైర్లు అమర్చుతున్నారు. అవి తగలగానే.. వన్యప్రాణులు భయపడి పారిపోయేలా ఏర్పాటు చేస్తున్నారు. కొందరు పంది నెయ్యిని వైర్లకు పూసి ఆ వాసనతో పందులు పారిపోతాయని భావిస్తున్నారు. ఏది ఏమైనా జిల్లాలో యాసంగి సీజన్ పంటలకు వన్యప్రాణుల బెడద ఎక్కువైంది. దీంతో రైతులు తమ శ్రమఫలాన్ని కోల్పోతున్నారు.

### విద్యుత్ తీగలు అమర్చితే కేసులు



రైతులు ఎవరూ కూడా పొలాల వద్ద విద్యుత్ తీగలను అమర్చొద్దు. ఎవరైనా అమర్చితే కేసులు నమోదు చేస్తాం. వన్యప్రాణులను వధించడం నేరం. పంటను కాపాడుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. కానీ ఇలా అమర్చిన వారిపైన కేసులు నమోదు చేశాం. ఎక్కడైన విద్యుత్ తీగలు అమర్చితే పోలీసులకు సమాచారం ఇవ్వండి. కఠిన చర్యలు తీసుకుంటాం. – అఖిల్ మహాజన్, ఎస్పీ

## బీఆర్‌ఎస్ నేతలు మెక్కింది కక్కిస్తాం

- ఇళ్ల పేరుతో చేసిన దోపిడీపై విచారణ చేయాలి
- గొర్రెలు, బర్రెల పంపిణీలో అక్రమాలు
- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులు మెక్కిన ప్రజల సొమ్మును కక్కిస్తామని సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ఉపాధిహామీ ద్వారా మంజూరైన రూ.25లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు పంచభూతాలను దోచుకున్నారని ఆరోపించారు. ఇసుక, ల్యాండ్, బతుకమ్మచీరల మాఫియాతో ప్రజల సొమ్మును దర్జాగా దోచుకున్నారని మండిపడ్డారు. గొర్రెలు, బర్రెల పంపిణీలో అవినీతి జరిగిందన్నారు. చివరికి అసైన్డ్ భూములను కూడా కబ్జా చేశారన్నారు. మూడు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇళ్ల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారం పోయిందని, అభివృద్ధి ఆగిపోతుందని బీఆర్‌ఎస్ నాయకులు బీరాలు పలుకుతున్నారని.. సిరిసిల్లలో అభివృద్ధి నిరంతరం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్లు కొండల్‌రెడ్డి, దేవేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, తిరుపతి, రాజిరెడ్డి, దీటి నర్సింలు, రాజేశం, నర్సింలు, భాను, విజయ్, నరేశ్, కిషన్, రమేశ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో 200 మంది చేరిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లికి చెందిన దాదాపు 200 మంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాగ్ నివేదికలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి పనులు బయటకు వచ్చినాయన్నారు. గొర్రెలు, చేపలు బర్రెలు సబ్సిడీ పథకాల కింద ఎంత అవినీతి జరిగిందో కాగ్ నివేదిక బయట పెట్టిందని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో అవినీతిపరులైన బీఆర్‌ఎస్ నాయకులను వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంటు ఎలక్షన్లో తమ సత్తా చాటాలని బండలింగంపల్లి యువకులను కోరారు. నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, దొమ్మాటి నర్సయ్య, జంగా అంజిరెడ్డి, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలచందర్, ఎల్లాగౌడ్, దేవయ్య, ఇమామ్, హైమద్, రాజిరెడ్డి, నవీన్, మార్పు రాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ అవసరాలకు సౌర విద్యుత్

- ప్రిన్సిపాల్ రాజగోపాల్



ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: సాంప్రదాయ వనరులు బొగ్గు, నూనె, సహజవాయు నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయని, సాంప్రదాయేతర సౌర విద్యుత్ మాత్రమే భవిష్యత్ తరాల అవసరాలను తీర్చుతుందని కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఎలక్ట్రికల్, మెకానికల్ డిప్లొమా ఫైనలియర్ విద్యార్థులకు సోలార్‌ప్లేట్స్ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ గత పదేళ్లలో సౌరవిద్యుత్ సామర్థ్యం ముప్పై రెట్లు పెరిగిందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ వియాన్ ఎనర్జీ టెక్నాలజీస్ మేనేజర్ పురుషోత్తంచారి సోలార్‌ప్లేట్స్ తయారీపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు శ్రీదేవి, తారా కృష్ణమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### సిరిసిల్లలో దొంగతనం

సిరిసిల్లక్రైం: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అడ్డగట్ల అరవింద్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. శనివారం రాత్రి సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అరవింద్ వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. శనివారం ఆ ఇంటి తలుపులు తీసి ఉండడానికి గమనించి అతని మేనమామ ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న అరవింద్‌కు తెలిపారు. వెంటనే వచ్చిన అతను సిరిసిల్లలోని ఇంటికి వచ్చి చూశాడు. ఇంటిలోని బీరువా పగులగొట్టి అందులో ఉన్న 10 గ్రాముల బంగారు చైన్, 7 గ్రాముల బంగారు కమ్మలు, 2 బంగారు రింగులు ఏడు గ్రాములు వెండి వస్తువులు, రూ.51వేల నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి

- నిరంతరం పెట్రోలింగ్ ఉండాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి నిఘాను పటిష్టం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అధికారులతో శనివారం సమీక్షించారు. దొంగతనాల కేసుల ఛేదనకు అన్ని కోణాల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌వోపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు ఛేదించాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బస్టాండ్లలో ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలలో నిఘా ఉంచాలని ఆదేశించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్లపై బారీకేడ్స్, కోన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఠాణా పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్‌మానేరును మొదలుపెట్టిందే కాంగ్రెస్

- వేములవాడ వెనుకబాటుకు బీఆర్‌ఎస్ కారణం
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిందని, ప్రాజెక్టు పూర్తయ్యే సమయానికి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అసెంబ్లీలో శనివారం సాగునీటి ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మిడ్‌మానేరు పూర్తవడంతోనే రంగనాయకసాగర్ ప్యాకేజీ-10, మల్లన్నసాగర్ ప్యాకేజీ-10కి నీళ్లు తీసుకుపోగలిగారన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ మిడ్‌మానేరు నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం రూ.5.04 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ముంపు గ్రామాల ప్రజల కోసం పరిశ్రమలు తీసుకొస్తామని, ఆ ఊసే ఎత్తలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో నిర్వాసితుల కష్టాలు తెలుసుకొని వారిలో ధైర్యం నింపిన విషయాన్ని గుర్తు చేశారు. వారి కష్టాలు తెలిసిన వ్యక్తిగా నిర్వాసితులకు ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5.04 లక్షలు, పరిశ్రమల ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. వరదకాల్వను నిర్మించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 10, 11వ ప్యాకేజీ పనులు పూర్తయ్యాయని, ఎగువమానేరు వెళ్లే ప్యాకేజీ 9 పనులు మాత్రం ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎందరు పోరాటాలు చేస్తే వచ్చిందో గుర్తుంచుకోవాలన్నారు. జిల్లా కేంద్రానికి రావాల్సిన ఆఫీసులు, కాలేజీలు తప్ప అదనంగా ఏమీ రాలేదని స్పష్టం చేశారు. మల్కపేట రిజర్వాయర్ కాల్వలు నిర్మించలేదని, కలికోట సూరమ్మ రిజర్వాయర్‌ను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కోనరావుపేట మండలానికి గోదావరి జలాలు రాలేదని, మండలాన్ని కోనసీమగా మార్చుతామన్న హామీ ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత తీసుకోవడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పోదాం పద సమ్మక్క జాతర

- ఈనెల 21 నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర
- ముస్తాబవుతున్న అమ్మవార్ల గద్దెలు
- భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- ఉమ్మడి జిల్లాలో ఎత్తు బెల్లం మొక్కులతో మొదలైన సందడి

గిరిజన తల్లుల సమ్మక్క-సారలమ్మ జాతర సమీపిస్తోంది.. ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భక్తులు ఎత్తు బెల్లం మొక్కు చెల్లించేందుకు సమ్మక్క మేడారం వెళ్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. జాతర నిర్వహించే ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బస్సులు, విద్యుత్, తాగునీరు, స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, టాయిలెట్లు, పార్కింగ్, విడిది, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లపై జాతర కమిటీల నిర్వాహకులు అధికారులు సమన్వయంతో ముందుకుసాగుతున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతర జరిగే తీరు, చేస్తున్న ఏర్పాట్లపై ప్రత్యేక కథనం.


శాంతినగర్ సమ్మక్క-సారలమ్మ గుడి

## రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఐదుచోట్ల

సిరిసిల్ల: సమ్మక్క జాతర నేపథ్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఒబులాపూర్ మూడు రోజులపాటు జనసంద్రమవుతుంది. సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబయి, భీవండి, షోలాపూర్, హైదరాబాద్ వంటి పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. 40 ఏళ్లుగా ఇక్కడ జాతర జరుగుతోంది. సిరిసిల్ల నుంచి మండెపల్లి, రాళ్లపేట మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణిస్తే సమ్మక్క-సారలమ్మ గద్దెలు దర్శనమిస్తాయి. ఆటోల సౌకర్యం ఉంది. వీర్నపల్లి మండలంలోని వన్పల్లి శివారు శాంతినగర్ భానోత్ గిరిజన తండాలో 52 ఏళ్లుగా సమ్మక్క-సారలమ్మ జాతర సాగుతోంది. సమీప గ్రామాల నుంచే కాకుండా పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి గిరిజనులు ఎక్కువగా వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ఎనిమిదేళ్లుగా జాతర జరుగుతోంది. కోనరావుపేట మండలంలోని శివంగళపల్లె, ముస్తాబాద్ మండల కేంద్రంలో గిరిజన తల్లుల గద్దెలు సిద్ధమయ్యాయి.

## 'ఖని'లో మినీ మేడారం


గోదావరి తీరంలో జాతర ప్రాంగణం

గోదావరిఖని(రామగుండం): మినీ మేడారంగా విలసిల్లుతున్న గోదావరిఖని గోదావరి నదీతీరం అడవి తల్లుల జాతరకు ముస్తాబవుతోంది. సింగరేణి యాజమాన్యం 1992లో గోదావరి తీరంలోని సంస్థ స్థలంలో సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభించింది. ఏటా సమ్మక్క మేడారం ప్రాంతానికి చెందిన కోయ పూజారులను తీసుకువచ్చి, ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. జాతర సమయంలోనే కాకుండా గోదావరి తీరాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా సింగరేణి యాజమాన్యం ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని తెలిపారు.

### పకడ్బందీ ఏర్పాట్లు



భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి. మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. నదీ తీరంలో స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు సిద్ధం చేస్తున్నాం. వంద టాయిలెట్స్ నిర్మిస్తున్నాం.

పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్

## హన్మంతునిపేటలో 42 ఏళ్లుగా..


హన్మంతునిపేట సమ్మక్క-సారలమ్మ ఆలయం

పెద్దపల్లిరూరల్: గిరిజన తల్లులు సమ్మక్క-సారలమ్మ జాతరకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో ఏటా జరుపుతున్నారు. హన్మంతునిపేట శివారులో 42 ఏళ్లుగా, తుర్కలమద్దికుంట పెద్దగుట్ట వద్ద 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న జాతరకు భక్తులు పోటెత్తుతారు. హన్మంతునిపేటకు చెందిన కంకటి గోపాల్ కిషన్‌రావు, ఆయన సోదరులు ప్రభాకర్‌రావు, శంకర్‌రావు, సుగుణాకర్‌రావు, రాంచందర్‌రావు, ప్రసాదరావులు తమ తండ్రి మధుసూదన్‌రావు, తల్లి అంబాబాయి జ్ఞాపకార్థం 10 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు సమ్మక్క-సారలమ్మ ఆలయం నిర్మించారు. ఈసారి జాతరకు అన్ని వసతులు కల్పిస్తున్నారు.

### ఏర్పాట్లు చేశాం..



సమ్మక్క జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు బిగించాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– పొల్సాని సుధాకర్‌రావు, హన్మంతునిపేట ఆలయ కమిటీ చైర్మన్


మీర్జంపేట జాతర స్వాగతతోరణం

## మీర్జంపేట మానేరు తీరాన..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో మానేరు నదీతీరాన సమ్మక్క జాతర 52 ఏళ్లుగా సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఎత్తు బెల్లం, తలనీలాలు సమర్పించి, మొక్కు చెల్లించుకుంటారు. పెద్దరాతుపల్లి మానేరు తీరంలో, పెగడపల్లి హుస్సేన్‌మియా వాగు తీరంలోనూ జాతర జరుగుతుంది.

### భక్తులకు సౌకర్యాలు కల్పించాం



మీర్జంపేట జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు సకల సౌకర్యాలు కలిపించాం. మానేరు వెంట మోటార్లు 24 గంటలు నడిపించేందుకు రైతులు సహకరిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. గ్రామ యువకులు, మహిళలు వలంటీర్లుగా సేవలందిస్తారు.

– అశోక్, జాతర కమిటీ చైర్మన్, మీర్జంపేట

## తేలుకుంట, అబ్బాపూర్‌లలో..


తేలుకుంటలో భక్తుల మొక్కులు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్, తేలుకుంట గ్రామాల్లో ఏటా సమ్మక్క జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. మేడారం కోయ పూజారులతో జరిపించే ఈ జాతరకు ఉమ్మడి కరీంనగర్‌లో జిల్లాలోని భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. అబ్బాపూర్‌లో 2002లో పోచమ్మ గుట్టపై, తేలుకుంటలో 1994లో రామప్ప గుట్టపై వెలసిన సమ్మక్క-సారలమ్మ తల్లులను కోయ పూజారులు తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమైంది. జాతర కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, విద్యుత్, తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాయి. స్నానాలకు తేలుకుంటలో రామప్ప చెరువు ఉండగా, అబ్బాపూర్‌కు డీ-83 కెనాల్ నీటితోపాటు హుస్సేన్‌మియా వాగు అందుబాటులో ఉన్నాయి.

## శంకరపట్నంలో 1978 నుంచి..


శంకరపట్నంలో సమ్మక్క గద్దె

శంకరపట్నం(మానకొండూర్): మండల కేంద్రంలో సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమై 46 ఏళ్లవుతోంది. కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం వీరయ్య, మరో 13 మంది కలిసి 1978 ఫిబ్రవరి 22న వెంకయ్య గుట్ట నుంచి అమ్మవార్లను తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు తిమ్మాపూర్, బెజ్జంకి, చిగురుమామిడి, మానకొండూర్ మండలాలు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి 10 నిమిషాలకో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. జాతర కమిటీవారు ఏర్పాట్లు చేశారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో జాతర నిర్వహించనున్నారు.

## గన్నేరువరం, మైలారం గ్రామాల్లో..


మైలారంలో ముస్తాబైన అమ్మవార్ల గద్దెలు

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతర కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. గన్నేరువరంలో చిలుకలగుట్ట సమీపంలో ప్రధాన రహదారి పక్కన, మైలారంలో శ్రీ మల్లికార్జునస్వామి పెద్దగుట్ట పక్కన లోయర్ మానేరు డ్యాంకు 100 మీటర్ల దూరంలో జాతర జరగనుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 10 వేల మందికి పైగా భక్తులు వస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## గోలివాడ ఇసుకలో కుంకుమ భరిణె



గోలివాడలో సమ్మక్క-సారలమ్మ గద్దెలు

రామగుండం: అంతర్గాం మండలంలోని గోలివాడ గోదావరి నది ఒడ్డున సమ్మక్క-సారలమ్మ జాతరకు 42 ఏళ్లు. 1982లో గ్రామానికి చెందిన జాలిగామ కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అక్కడ ఇసుకలో కుంకుమ భరిణె కనిపించడంతో ఇంటికి తీసుకువచ్చారు. అదేరోజు రాత్రి నిద్రలో వనదేవతలు కలలోకి వచ్చి, నీకు కుంకుమ భరిణె దొరికిన స్థానంలో సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజుల గద్దెలు నిర్మించి, జాతర నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రముఖులు ఆవుల చంద్రయ్య, పెంద్రు హన్మాన్‌రెడ్డిలకు చెప్పారు. అందరూ కలిసి గోదావరి నది ఒడ్డుకు వెళ్లి, పరిశీలించగా కుంకుమ భరిణె, పూజా సామగ్రి కనిపించాయి. దీంతో అదే ఏడాది వనదేవతల గద్దెలు నిర్మించి, జాతర ప్రారంభించారు. గ్రామానికి చెందిన 41 మందితో వ్యవస్థాపక కమిటీ ఏర్పాటు చేసుకొని, జాతర కొనసాగిస్తున్నారు.

## కొలనూర్‌లో కోయ పూజారులతో..


ముస్తాబైన సమ్మక్కసారలమ్మ గద్దెలు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్‌లో 1974 నుంచి జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు ఈసారి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మేడారం కోయ పూజారులతో పూజలు నిర్వహించనున్నారు. ఇక్కడ అల్లీమాసాని చెరువు(జంపన్నవాగు) ఉంది. సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం, సిర్పూర్‌కాగజ్‌నగర్, నాగపూర్ నుంచి కొలనూర్ జాతర వరకు రైళ్ల సౌకర్యం ఉంది. దీనికితోడు భక్తులకు గోదావరిఖని, కరీంనగర్, వరంగల్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి 2 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా.

### భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం



కొలనూర్ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు నీడ, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. స్నానాల కోసం సమీపంలోని జంపన్నవాగు వద్ద స్నానవాటికలు ఏర్పాటు చేశాం. అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లు సిద్ధమయ్యాయి.

– దేవిడి శ్యాంరెడ్డి, జాతర కమిటీ చైర్మన్

## చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద


చిల్వాకోడూర్‌లో ముస్తాబైన గద్దెలు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చిల్వాకోడూర్, వెల్గటూర్ మండల కేంద్రంతోపాటు, రాజారాంపల్లి, ధర్మపురి మండలంలోని రామయ్యపల్లి గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర జరుగుతుంది. నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద నిర్వహించే జాతరకు జగిత్యాల జిల్లాలోనే అత్యధిక మంది భక్తులు తరలివస్తారు. అమ్మవార్లకు బుక్క, పూసవేర్ల, మేడారం పూజారులు పూజలు చేస్తారు. 1994లో గ్రామానికి చెందిన గందె రామయ్య, కరెంట్ రాజయ్య కలలో దేవతలు కనిపించడంతో కంకవనం తీసుకువచ్చి, ఎక్కల్‌దేవి గుట్ట సమీపంలో పాతి, పూజలు చేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమైంది. 2001 నుంచి మేడారం పూజారులచే పూజలు చేయిస్తున్నారు. రాజారాంపెల్లిలో ఏలేటి వంశీయులు 2011లో ఏర్పాటు చేసిన గద్దెల వద్ద ఏటా జాత జరుగుతోంది. ఈసారి కూడా ఏర్పాట్లు చేసినట్లు జాతర కమిటీ చైర్మన్ శైలేందర్ రెడ్డి తెలిపారు.

### ఏటా జాతరకు వస్తా..

మాది సమక్క-సారలమ్మ వెలసిన మేడారం గ్రామం. చిల్వాకోడూర్‌లో మా బావ కోరం హన్మంతు ఏటా జాతరకు వచ్చి, పూజలు చేసేవాడు. ఆయన నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో నేను వస్తున్నాను. ఏటా లక్షన్నరకు పైనే భక్తులు వస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, జాతరకు సహకరించాలి.

– కోరం లక్ష్మణ్, పూజారి, సమ్మక్క మేడారం

## నీరుకుల్ల-వేగురుపల్లి మధ్య


2022లో జాతర ప్రదేశంలో భక్తుల విడిది

సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నీరుకుల్ల-వేగురుపల్లి గ్రామాల మధ్య రంగనాయకస్వామి ఆలయ సమీపంలో 45 ఏళ్లుగా సమ్మక్క-సారలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగుతోంది. పెద్దపల్లి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం కోయ పూజారులు వచ్చి, ఇక్కడ పూజలు చేస్తారు. జారత ప్రదేశంలో మానేరు నది ఉంది. దేవాదాయశాఖ, జాతర కమిటీవారు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, గోదావరిఖని నుంచి సుల్తానాబాద్ మీదుగా, కరీంనగర్ నుంచి వేగురుపల్లి మీదుగా జాతరకు బస్సులు, ఆటోలున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి నుంచి రైల్వే సౌకర్యం కూడా ఉంది.

### అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు



జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రోడ్లు, విద్యుత్, ట్రాఫిక్, వైద్యం, శానిటేషన్, అత్యవసర సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– నర్సయ్యగౌడ్, జాతర కమిటీ చైర్మన్

## 1990 నుంచి రేకుర్తిలో..


రేకుర్తిలో అమ్మవార్ల గద్దెలు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో సమ్మక్క-సారలమ్మ జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. 1990లో పిట్టల రాజమల్లయ్య కలలో సమ్మక్క-సారలమ్మ కనిపించి, గద్దెలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఆయన అదే ఏడాది ఫిబ్రవరి 6న అమ్మవార్లకు గద్దెలు నిర్మించారు. అప్పటినుంచి రెండేళ్లకోసారి జాతర జరుగుతోంది. ఇక్కడికి కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి జగిత్యాల ప్రధాన రహదారిలో 4 కిలోమీటర్ల దూరంలో అమ్మవార్ల గద్దెలున్నాయి. బస్టాండ్ నుంచి ఆటోలు, బస్సులు నడుస్తాయి. జాతరకు కార్పొరేషన్ నిధుల నుంచి రూ.66 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వివిధ వస్తువుల అమ్మకాల టెండర్ ద్వారా రూ.9 లక్షలు సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కోయ పూజారులచే పూజలు జరిపించనున్నారు.



## రాజన్న ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు కసరత్తు


యాదాద్రి అధికారులతో సమాలోచనలు చేస్తున్న రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలపై యాదాద్రి ఆలయ అధికారులతో శనివారం సమాలోచనలు చేశారు. ఇటీవల నిర్వహించిన జాతర కమిటీ సమావేశంలో వీఐపీలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని చర్చకు వచ్చింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనలతో రాజన్న ఆలయ ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, నాగుల మహేశ్, ఏఈ నాగరాజులు యాదాద్రి ఆలయ ఏఈవో రామ్మోహన్, పర్యవేక్షకులు రాజన్‌బాబులతో చర్చించారు. వీఐపీలకు బ్రేక్ దర్శనం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధివిధానాల గురించి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో సమావేశమై వీఐపీలకు బ్రేక్ దర్శనంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## డ్రగ్స్ నియంత్రణ అవగాహనకు 3న 5కే రన్

సిరిసిల్లక్రైం: యువతను పెడదారి పట్టించే మాదకద్రవ్యాలతో కలిగే అనారోగ్యాలను వివరించి, నియంత్రించేందుకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. సిరిసిల్లలో మార్చి 3న నిర్వహించే యువకులు హాజరుకావాలని కోరారు. రన్నింగ్‌లో మొదటి 13 మందికి సైకిళ్లు బహుమతులుగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వివరాలకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## శ్మశానస్థలం కబ్జాపై ఆందోళన


ఆందోళన చేస్తున్న భూపతినగర్ వాసులు

సిరిసిల్లటౌన్: రియల్టర్లు శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేయడంపై శనివారం జిల్లా కేంద్రంలోని భూపతినగర్‌వాసులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యక్తులు కొద్ది రోజులుగా గ్రేయార్డు స్థలంలో చదును చేస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా తయారు చేస్తున్నారని తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నారు. బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. తమ తాతల కాలం నుంచి సదరు స్థలంలో శ్మశానవాటిక ఉందని తమ ఏరియాలో భూమికి రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి జరుగుతున్న కుట్రలను మున్సిపల్ అధికారులు, పాలకవర్గం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. స్థానిక కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జూనియర్ సివిల్ జడ్జి సృజన



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సృజన, పాల్గొన్న జడ్జి ప్రవీణ్

సిరిసిల్లటౌన్: బాలబాలికల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి కె.సృజన పేర్కొన్నారు. సిరిసిల్ల విజ్ఞానవర్ధిని హైస్కూల్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. విద్యార్థులు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రవీణ్, లీగల్ ఎయిడ్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్శరాములు, న్యాయవిజ్ఞాన సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, ఆడెపు వేణు, కరెస్పాండెంట్ మందాడి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో పురుడుపోసిన 108 సిబ్బంది


బాబును చూపుతున్న 108 సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చీర్లవంచకు చెందిన సులోచన(22) 108 అంబులెన్స్‌లోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. నిండు గర్భిణీ అయిన సులోచనకు శనివారం పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో తరలిస్తున్నారు. మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో స్పందించిన ఈఎంటీ శ్రీకాంత్, పైలట్ మనోజ్ ఆశ కార్యకర్తల సహాయంతో పురుడు పోశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.